క్లుప్తంగా

వైఎస్ జగన్‌ను కలిసిన సూర్యప్రకాష్



మాజీ సీఎం జగన్‌తో సూర్యప్రకాష్

ఏలూరు రూరల్ : వైఎస్సార్ సీపీ పోణంగి నాయకుడు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.సూర్యప్రకాష్ గురువారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో జగన్‌ను కలుసుకుని నియోజకవర్గంలో పార్టీ విషయాలపై మాట్లాడారు.

కృష్ణదాస్ అరెస్ట్ దుర్మార్గం



వసంతమహల్ సెంటర్‌లో ధర్నా చేస్తున్న నాయకులు


ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇస్కాన్ ప్రతినిధి చిన్మయ కృష్ణదాస్‌ను బంగ్లాదేశ్ ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేయడం దుర్మార్గమని హిందూ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కృష్ణదాస్ అరెస్టుకు నిరసనగా ఐక్యకార్యాచరణ సమితి నాయకులు గురువారం నగరంలోని వసంతమహల్ సెంటర్ వద్ద ధర్నా చేశారు. శాంతియుత మార్గంలో ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాలు నిర్వహించే ఇస్కాన్ ప్రతినిధిని అరెస్ట్ చేయడం ద్వారా బంగ్లాదేశ్ ప్రభుత్వం హిందువుల వ్యతిరేకతను మూటగట్టుకుంటోందన్నారు. భారత ప్రభుత్వం తక్షణమే స్పందించి కృష్ణదాస్‌ను విడిపించే ప్రయత్నం చేయాలని కోరారు. అనంతరం బంగ్లాదేశ్ జాతీయ పతాకాన్ని దహనం చేశారు. కార్యక్రమంలో వివిధ హిందూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆలయ ఈఓకు నోటీసు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఈ నెల 3న స్థానిక పడమర వీధి వేంకటేశ్వర స్వామి దేవస్థానం వద్ద ఉన్న దొంగల మండపం సమీపంలో రెండు వృక్షాలను నరికించిన వేంకటేశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారికి ఏలూరు అర్బన్ తహసీల్దార్ జీవీ శేషగిరి నోటీసు జారీ చేశారు. వృక్షాల నరికివేతపై మూమెంట్ ఫర్ పీస్, జస్టిస్ కార్యదర్శి ఎండీ ఇస్మాయిల్ షరీఫ్ ఈ నెల 9న చేసిన ఫిర్యాదు మేరకు విచారణ చేసిన తహసీల్దార్ వృక్షాల నరికివేతపై వాల్టా చట్టం ప్రకారం నివేదిక ఇవ్వాలని ఈఓకు నోటీసు జారీ చేశారు.

సమస్యలతో విద్యార్థుల సహవాసం

- పాఠశాలల్లో నిరుపయోగంగా ఫిర్యాదుల బాక్సులు
- హెచ్‌ఎంల వద్దే తాళాలు
- ఉన్నతాధికారుల దృష్టికెళ్లని సమస్యలు
- ఫిర్యాదు చేయడానికి వెనుకాడుతున్న విద్యార్థులు



నగరంలోని ఒక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పెట్టె

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థులు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి, వారి సమస్యలు ఉన్నతాధిరుల దృష్టికి తీసుకెళ్లడానికి పాఠశాలల్లో చాలా కాలం క్రితమే ఫిర్యాదుల బాక్కులు ఏర్పాటు చేశారు. ఫిర్యాదు చేయాలంటే ఉపాధ్యాయులో, ప్రధానోపాధ్యాయులో కక్ష కట్టి తమను మరిన్ని సమస్యల్లోకి నెట్టేస్తారనే భయం విద్యార్థుల్లో నెలకొంది. ఆ బాక్సుల్లో విద్యార్థులు తమ ఫిర్యాదులు వేసిన సందర్భాలు నామమాత్రమనే చెప్పాలి. ఏలూరు నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ యాజమాన్యాల్లోని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు నిత్యం ఏదో ఒక సమస్యతో సతమతమౌతున్నారు. మరుగుదొడ్ల వద్ద దుర్గంధం వెదజల్లుతోందని చెబుతున్నారు. కొన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యత ప్రమాణాల మేరకు లేదని, రుచికరంగా ఉండకపోవడంతో ఇంటి నుంచే భోజనాలు తెచ్చుకుని తినాల్సి వస్తోందని వాపోతున్నారు. ముఖ్యంగా బాలికలపై కొందరు ఉపాధ్యాయులు అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని, ప్రైవేట్‌పార్ట్‌లను తాకుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఇటీవల తరచూ వార్తలు వస్తున్నాయి.

ఫిర్యాదు చేయదానికి వెనుకడుగు

విద్యార్థుల సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి రావడం కోసం ఏర్పాటుచేసిన కంప్లెయింట్ బాక్సులు కొన్ని పాఠశాలల్లో మూలనపడేశారు. మరికొన్ని పాఠశాలల్లో ఫిర్యాదుల బాక్సులు ఉన్నప్పటికీ అందరికీ కనబడేలా ఉండడంతో ఫిర్యాదులు వేయడానికి విద్యార్థులు వెనుకాడుతున్నారు. ఫిర్యాదులు వేసే సమయంలో ఎవరైనా గమనించి తమనే లక్ష్యం చేస్తారనే ఆందోళన వారిలో ఉంది. బాలికల విషయంలో జరిగే అసభ్య ప్రవర్తనలపై ఫిర్యాదులు చేయడానికి బాలికలు కూడా భయపడుతున్నారు.

విద్యార్థి సంఘాల ఆగ్రహం

కొందరు విద్యార్థులు బాక్సుల్లో ఫిర్యాదులు వేసినప్పటికీ అవి ఉన్నతాధికారుల దృష్టికెళ్లే పరిస్థితి కనిపించడం లేదని విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదుల బాక్సుల తాళాలు అదే పాఠశాల ప్రధానోపాధ్యాయుని వద్ద ఉంచడమే ఇందుకు ప్రధాన కారణంగా చెబుతున్నారు. ఫిర్యాదులను చదివే అవకాశం, హెచ్‌ఎంపై చేసే ఫిర్యాదు కాపీలను తొలగించే వెసులుబాటు హెచ్‌ఎంలకు ఉండటంతో విద్యార్థులకు న్యాయం జరిగే అవకాశం ఉండదని, వారిపై ప్రతీకార చర్యలు తీసుకునే ప్రమాదం ఉందని వాపోతున్నారు. సమస్యలు తెలుసుకోవడానికి పటిష్టమైన వ్యవస్థ లేకపోవడంతో విద్యార్థులు సమస్యలతో సహజీవనం చేయాల్సి వస్తోందని చెబుతున్నారు.

ఉన్నతాధికారులు స్పందించాలి



ఫిర్యాదుల బాక్సులు చాలా పాఠశాలల్లో అందుబాటులో లేక విద్యార్థుల సమస్యలతో సతమతమవుతున్నారు. ఈ బాక్సులతో విద్యార్థులకు ఒనగూరే ప్రయోజనాలను దూరం చేసే ఉద్దేశం కనిపిస్తోంది. విద్యార్థినులపై అసభ్యంగా ప్రవర్తించే ఉపాధ్యాయుల నిగ్గు తేలడానికి కంప్లెయింట్ బాక్సులు ఉపయోగపడతాయి. ఈ విషయంపై అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

– కె.లెనిన్, జిల్లా కార్యదర్శి, ఎస్ఎఫ్ఐ

ఎంఈఓల వద్దే తాళాలు ఉంచాలి



విద్యార్థులు నేరుగా ఫిర్యాదు చేయలేని అనేక సమస్యలను కంప్లెయింట్ బాక్సుల ద్వారా తెలుపుకునే అవకాశం ఉంటుంది. ఐతే ఈ బాక్సుల తాళాలు ప్రధానోపాధ్యాయులు, ఎంపీడీఓల వద్ద ఉంచాలని తీసుకున్న నిర్ణయం సరికాదు. ఈ బాక్సుల తాళాలు ఎంఈఓల వద్ద ఉంచాలి. బాక్సులను వారంలో రెండు సార్లు తెరిచి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి.

– కాకి నాని, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు

ఈవీఎం గోడౌన్ తనిఖీ



ఈవీఎం గోడౌన్ సీలు తనిఖీ చేస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): స్థానిక కలెక్టరేట్‌లో ఉన్న ఈవీఎం యంత్రాలు, వీవీప్యాట్‌లు భద్రపరిచే గోడౌన్‌ను గురువారం జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తనిఖీ చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవీఎం గోడౌన్ తనిఖీలో భాగంగా ఈవీఎం గోదాము తాళాలు, సీసీ కెమెరాల పనితీరు, అగ్నిమాపక దళ పరికరాలు మొదలైనవి పరిశీలించారు. అనంతరం సెక్యూరిటీ లాగ్ బుక్‌లో సంతకం చేశారు. గోడౌన్ వద్ద పోలీస్ గార్డులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కలెక్టర్ వెంట డీఆర్ఓ వి.విశ్వేశ్వరరావు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకురాలు

గంగా నాగమణి మృతి



గంగా నాగమణి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న జయప్రకాష్

ఏలూరు టౌన్: వైఎస్సార్ సీపీ ఏలూరు నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకురాలు, వెంకటాపురం పంచాయతీ వార్డు మాజీ మెంబర్ పల్లెల గంగా నాగమణి గురువారం తెల్లవారు జామున కార్డియాక్ అరెస్ట్‌తో మృతి చెందారు. ఆమె భౌతిక కాయాన్ని వైఎస్సార్ సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్, పార్టీ నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గంగాభవాని పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దాసరి రమేష్, మున్నుల జాన్‌గురునాథ్, బీసీ సెల్ నాయకులు కిలాడి దుర్గారావు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ మేతర సురేష్, దాలి వెంకటేష్, ప్రవీణ్ తదితరులున్నారు. నాగమణికి భర్త గోపి, కుమారులు లిఖిత్, హరీష్ ఉన్నారు. ఇటీవల ఆమె మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. నాగమణి అంత్యక్రియలు గురువారం ఉదయం నగరంలో నిర్వహించారు.

రెసిడెన్షియల్ శిక్షణలు ఎత్తివేయాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రెసిడెన్షియల్ శిక్షణల వల్ల ఒక్కో ప్రాణం రాలిపోతున్నందున ఉపాధ్యాయులకు ఇక రెసిడెన్షియల్ శిక్షణలు వద్దని ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర అకాడమిక్ కమిటీ కన్వీనర్ గుగులోతు కృష్ణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రత్నం బాబు, జి.మోహన్ రావు ఒక ప్రకటనలో విద్యాశాఖను కోరారు. విజయనగరం జిల్లా గజపతి నగరం బాలాజీ పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న లీడర్ షిప్ ట్రైనింగ్ సెంటర్‌లో గురువారం ఉదయం ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు మరణించడం పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. శిక్షణా కేంద్రాల్లో కనీస వైద్య సదుపాయం కల్పించి ఉంటే ఇలాంటి ఘటనలు జరుగుతాయా అని ప్రశ్నించారు. ఎఫ్ఎల్ఎన్, లీడర్షిప్ రెసిడెన్షియల్ శిక్షణలన్నింటినీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆన్‌లైన్ శిక్షణలకు ప్రాధాన్యత కల్పించాలని, తప్పనిసరైయితే స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో లేదా మండల స్థాయిలో శిక్షణ ఏర్పాటు చేయాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అశోక్ నగర్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ కేఎం అంబేద్కర్ తెలిపారు. రామచంద్రరావు పేట, పత్తేబాద 4 గుడుల సెంటర్, పానుగంటి వారి వీధి, అతిథి హోటల్ రోడ్, శంకరమఠం ప్రాంతం, విజయ విహార్ సెంటర్, అమీనాపేట, అశోక్ నగర్, పత్తేబాద, మోతేవారితోట, దాసరి ఎర్రయ్య వీధి, నరసింహారావు పేట, పవర్ పేట, పోలీస్ క్వార్టర్స్, ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంతం, కలెక్టర్ ఆఫీసు ఏరియా, జిల్లా పరిషత్ కార్యాలయ ప్రాంతం, రంగూన్ మేడ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. సుంకరవారి తోట సబ్‌స్టేషన్ పరిధిలోని మాదేపల్లి రోడ్డు, సుంకర వారి తోట, ప్రేమాయలం ప్రాంతం, గాయత్రి నగర్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

పూలే ఆశయాలు స్ఫూర్తిదాయకం

- జిల్లా కార్యాలయంలో ఘన నివాళి
- వైఎస్సార్ సీపీ సమన్వయకర్త జేపీ



జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త జయప్రకాష్

ఏలూరు టౌన్: కుల వివక్షకు వ్యతిరేకంగా, బలహీనవర్గాల అభ్యున్నతికి అవిరళ కృషి చేసిన మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలు స్ఫూర్తిదాయకమని వైఎస్సార్ సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ అన్నారు. జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా పార్టీ ఏలూరు జిల్లా కార్యాలయంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జయప్రకాష్ మాట్లాడుతూ దేశచరిత్రలో మొట్టమొదటిగా మహాత్మునిగా ప్రజలతో నీరాజనాలు అందుకున్న నాయకుడు జ్యోతిరావు పూలే అన్నారు. బాల్య వివాహాలు, వితంతువులకు పునర్వివాహాలపై ప్రజలను చైతన్య పరిచిన గొప్ప నాయకుడన్నారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్లు నూకపెయ్యి సుధీర్‌బాబు, కార్పొరేటర్ సుంకర చంద్రశేఖర్, పార్టీ ఎస్సీ సెల్‌రాష్ట్ర కార్యదర్శి మున్నుల జాన్‌గురునాథ్, బీసీ సెల్‌రాష్ట్ర కార్యదర్శి కిలాడి దుర్గారావు, మాజీ ఎంపీటీసీ పల్లి శ్రీనివాస్, మహిళా నాయకురాలు తులసి, తదితరులున్నారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిబా పూలే

ఏలూరు (టూటౌన్): మహాత్మా జ్యోతిబా పూలే 135వ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఏలూరు నగరంలోని పలు సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. బలహీన వర్గాల ఆశాజ్యోతి, దళిత జాతుల అభ్యున్నతికి కృషి చేసిన మహాత్మా జ్యోతిబాపూలే అని వక్తలు కొనియాడారు. జిల్లా పరిషత్ సెంటర్, జూట్ మిల్ వద్ద ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు బీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్, బీసీ కులాల జేఏసీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు ఎస్వీఆర్ విఠల్ కుమార్, లంక వెంకటేశ్వరరావు, పామర్తి ఏసు రాజు, లక్కోజు రాజగోపాలాచారి, ఉక్కుసూరి గోపాలకృష్ణ, రామ సూరి, మట్టా నాగేంద్ర, ఎం అజయ్ బాబు, పి.ఆదిశేషు, కె.కన్నబాబు, రామా రావు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

- నరసింహారావుపేటలోని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యాలయంలో పూలే చిత్రపటానికి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మెండెం సంతోష్ కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. పూలే సమసమాజ నిర్మాణానికి సామాజిక న్యాయ పోరాటం చేసి సత్యశోదక సమాజ సంస్థను ప్రారంభించి, విద్యాసంస్థలు నెలకొల్పారని గుర్తుచేశారు. నాయకులు వెంపా నాగరాజు, నూకపెయ్యి కార్తీక్, బి.నాగరాజు, జి.నాగేశ్వరరావు, తెనాలి సురేష్ బాబు, నాని పాల్గొన్నారు.



జిల్లా పరిషత్ సెంటర్‌లో నివాళులర్పిస్తున్న ఉద్యోగులు, నాయకులు

- ఎస్సీ, ఎస్టీ బహుజన రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ కార్యాలయంలో అధ్యక్షుడు ఎం అశోక్ కుమార్ అధ్యక్షతన పూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. మానవత డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ మేతర అజయ్‌బాబు పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పూలే ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బయ్యారు రాజేశ్వరరావు, బొద్దుల వేణు, మెల్లిపాక ఎంకన్న, చౌటుపల్లి శ్రీనివాసరావు, యోహాను, రాజేష్, సింహాద్రి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని గ్రహించిన మహాత్మా జ్యోతీరావు పూలే విద్యను ప్రోత్సహించడానికి విశేషంగా కృషి చేశారని ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కేఎం అంబేడ్కర్ అన్నారు. గురువారం స్థానిక విద్యుత్ భవన్‌లో మహాత్మా జ్యోతీ రావు పూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఓ ఫైనాన్స్ టి.రాజశేఖర్, డిప్యూటీ ఈఈలు టి.రాజకుమార్, టి.నాగేశ్వరరావు, ఎ.రమాదేవి, ఎన్ సుధీర్, నాయకులు తురగా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పూలే సేవలు వెలకట్టలేం

ఏలూరు రూరల్ : మహాత్మ జ్యోతిరావుపూలే దేశానికి చేసిన సేవలు వెలకట్టలేమని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. పోణంగి జెడ్పీ పాఠశాలలో స్మార్ట్‌సిటీ లయన్స్ క్లబ్, ట్రేస్ ఇండియా సంస్థ సంయుక్తంగా పూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఇమ్మానియేలు, ఎం శ్రీనివాసరావు, ఎంవీవీ కృష్ణారావు, దిడ్ల యాంజి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ ఆలీ, ఏపీఎస్‌టిపి రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జీజేఏ స్టీవెన్ పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులను దాతలను సన్మానించారు. విద్యార్థులు జంతువుల మాస్కులతో ఆకట్టుకున్నారు. ఉపాధ్యాయులు కె.పద్మ, బి.శాంతి, కె.శ్యామల, ఎం అన్నపూర్ణ, ఎం సుబ్బలక్ష్మి, కె.సురేఖ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతిరావుపూలే వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులు, విద్యార్థులు



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యుత్ ఉద్యోగులు

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	33
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	37
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	17
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	30

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	30
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	26
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	33
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	33
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	30
ఏలూరు-బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	33
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	37
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	24
ఏలూరు - తిరుపతి	16.00	4830	16

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	48	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	64
వంకాయలు (కాంతులు)	36	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	44	ములక్కాడలు	07, 10
బెండకాయలు	30	కంద	80
పచ్చిమిర్చి	20-26	బీట్‌రూట్	60
కాకర కాయలు	30-40	కీరా దోస	36
బీరకాయలు	28	ఫ్రెంచ్‌బీన్స్	70
బీరకాయలు (పందిరి)	36	అల్లం	70
క్యాబేజీ	32-40	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	68	పాలకూర	10
దొండకాయలు	34	చుక్కకూర	12
బంగాళదుంపలు	38	తోటకూర	10
ఉల్లిపాయలు	36-58	గోంగూర	07
గోరుచిక్కుడు	34	పుదీనా	05
దోసకాయలు	24-28	బఠాణీ	--
ఆనపకాయ (1)	20-25	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40

4న విజయవాడలో ప్రజాహక్కుల సభ



ఏలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఏలూరు (టూటౌన్): ఎన్నికల హామీల అమలు కోరుతూ డిసెంబర్ 4 విజయవాడ జింఖానా గ్రౌండ్లో నిర్వహించే ప్రజా హక్కుల సభను విజయవంతం చేయాలని కోరుతూ ఏలూరు నగరంలో ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి బుగత బంగారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలవుతున్నా ఇచ్చిన ఎన్నికల హామీల్లో ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. పేదలకు స్థలం ఇచ్చి ఇల్లు కట్టిస్తానన్న చంద్రబాబు మాటలు నీటి మూటలు అయ్యాయని అన్నారు. ఎన్నికల ముందు చేగువేరా జెండా భుజనా వేసుకొని తిరిగిన పవన్ కళ్యాణ్ ఎన్నికల అనంతరం మోదీ మాయలో కాషాయకరణ బాబా అవతారం ఎత్తారని ఎద్దేవా చేశారు. యువగళం పాదయాత్రలో విద్యార్థులందరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ పూర్తిస్థాయిలో అందిస్తానన్న మంత్రి నారా లోకేష్ నేడు కనీసం అమ్మకి వందనం ఊసెత్తకపోవడం దుర్మార్గమని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్)లో పోర్టు పోలియో సభ్యులు శంకర్, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.హరినాథ్, సీనియర్ నాయకులు ఆంజనేయులు, ఏఐఎస్ఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉన్నం అనిల్ కుమార్, జిల్లా కార్యదర్శి గరికె అఖిల్, ఏలూరు సిటీ కార్యదర్శి నారి, నాయకులు పృథ్వి , శ్రీను, నాగరాజు, సాయి, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

పని ఒత్తిడితో అనారోగ్యం

భీమడోలు: గత ఐదు నెలలుగా అదనపు పని భారంతో తీవ్ర ఒత్తిడికి గురై అనారోగ్యాల బారిన పడుతున్నామని, పనిభారాన్ని తగ్గించాలని గురువారం స్థానిక ఎంపీడీఓ సీహెచ్ పద్మావతీదేవికి గ్రామ పంచాయతీ కార్యనిర్వాహక అధికారులు, సచివాలయ కార్యదర్శులు వినతిపత్రం అందించారు. ప్రతి రోజూ మూడుసార్లు బయోమెట్రిక్‌లు వేయడం, సర్వేలు చేయించడం, సర్వేలో పురోగతి తగ్గినా ఉన్నతాధికారుల నుంచి వచ్చే క్రమశిక్షణా చర్యలకు బాధ్యులవుతున్నామని పేర్కొన్నారు. సిబ్బంది కొరతతో ఒక్కో కార్యదర్శికి రెండు, మూడు పంచాయతీలకు ఇన్‌చార్జీలుగా వ్యవహరిస్తున్నామని తెలిపారు. అంతులేని యాప్‌లతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. ఈఓలు వెంకట్రావు, మురళీ, ముత్తయ్య, తనూజ, ధర్మ, గౌతమి, లావణ్య, జయరామకృష్ణ పాల్గొన్నారు.

రైతుల్లో తుపాను కలవరం



గుండుగొలను వద్ద ధాన్యంపై కప్పిన టార్పాలిన్లు



పూళ్లలో యంత్రంతో వరి కోత

భీమడోలు: తుఫాన్ హెచ్చరికలతో రైతులు కలవరపడుతున్నారు. ఈనెల 29, 30వ తేదీల్లో అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ఆరుగాలం పండించిన పంట చేతికందే దశలో రైతుల్లో తుపాన్ గుబులు పట్టుకుంది. వర్షాల వల్ల నష్టం వాటిల్లితే చేసిన అప్పులు తీర్చేదెలా అని ఆందోళన చెందుతున్నారు. భీమడోలు మండలలో 12,873 ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేశారు. ఇప్పటికే 9,200 ఎకరాల్లోని పంట నూర్పిళ్లు పూర్తయ్యాయి. సుమారు 12,293 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అధికారులు సేకరించారు. మండలంలో 24 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేశారు. ఇంకా 12 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రావాల్సుంది. ఇంకా 3,673 ఎకరాల్లో పంట గట్టెక్కాల్సుంది. పీఎల్ వరి పంట కోత దశలో ఉంది. రైతులు కోత యంత్రాలతో మాసూళ్లు చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. తేమశాతం నిబంధనలతో కొందరు రైతులు ధాన్యాన్ని రోడ్లపై ఆరబెడుతున్నారు. ధాన్యాన్ని గోనె సంచుల్లో ఉంచి టార్పాలిన్లతో రక్షించుకుంటున్నారు. ఈ సార్వా సీజన్‌లో 35 నుంచి 40 బస్తాల దిగుబడి మించి రాకపోవడంతో పెట్టుబడులు వస్తాయోలేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ తుఫాన్ నుంచి బయటపడితే ఉపశమనం పొందుతాయని చెబుతున్నారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో వరి కోతలను మూడు రోజుల పాటు వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి ఎస్‌పీవీ ఉషారాణి రైతులకు సూచిస్తున్నారు.



భీమడోలులో ధాన్యం పట్టుబడి చేస్తున్న దృశ్యం